# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 80 గుంటూరు, ఆదివారం 30- 11 - 2025 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం: కులం పేరును మారుస్తూ"




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దొమ్మర కులం పేరును "దొర వంస "గా మార్చే ఉత్తర్వులు జారీ చేసింది. సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడిన వర్గాలలో ఉన్న "దొమ్మర" కులపేరును మార్చడం ఈ నిర్ణయానికి కారణమైంది. 1970లో జారీ చేసిన అప్పటి జీవో ప్రకారం, "దొమ్మర" వర్గం గ్రూప్‌లో చేర్చబడింది. కొంతమంది ఈ వర్గానికి చెందిన వ్యక్తులను అవమానపరిచేలా దూషణ పదాలు ఉపయోగిస్తున్నారు, దాంతో వారి ఆత్మగౌరవం దెబ్బతింటోంది. దీనిని ఎదుర్కొని, ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం కులపేరును మార్చడం నిర్ణయించింది. ఇక కొత్త సవరణ ప్రకారం, బీసీ ఏ జాబితాలో .7 వద్ద అని మాత్రమే చూపబడుతుంది. కుల ధ్రువపత్రాలలో కూడా కొత్త పేరే రాయాల్సి ఉంటుంది.

# రైతన్నలారా..

## సమస్యలన్నీ పరిష్కరిస్తా...



**అమరావతి, నవంబర్ 29:** రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని.. ఇందుకు అనుగుణంగా 3 ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శనివారం నాడు మీడియాతో సీఎం ఇష్టాగోష్టి నిర్వహించారు. అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకుండా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. రాజధాని రైతులంతా ఇక ఒకే గొడుగు కిందకు రావాలని పిలుపునిచ్చారు. అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కింద అంతా ఒకే జేఏసీగా ఏర్పడితే వారితో సంప్రదిస్తూ అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రాజధాని రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు గురించి కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించామని. . కేంద్రంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారని తెలిపారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రాజధాని రైతుల నుంచి సిబ్బంది డబ్బులు అడిగితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. భూ త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సీఆర్డీఏ అధికారులు, సిబ్బందిపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. త్వరలోనే ఆ దిశగా కార్యచరణ రూపొందిస్తామని ప్రకటించారు. రైతు సమస్యల పరిష్కారంలో తొలుత కొంత గ్యాప్ వచ్చిందని.. అయితే తనతో సమావేశం తర్వాత అన్నింటిపైనా స్పష్టత వచ్చిందని వెల్లడించారు.

రైతులు కూడా ఆనందంగా ఉన్నారన్నారు. రెండో దశ భూ సమీకరణ ఉపయోగాలపై రైతులకు వివరించినట్లు చెప్పారు. మునిస్పాలిటీగా అమరావతి మిగిలిపోకుండా మహానగరంగా అభివృద్ధి చెందితే ఎలాంటి ఫలితాలు ఉంటాయో రైతులు అర్థం చేసుకున్నారన్నారు. త్రిసభ్య కమిటీ నిరంతరం రైతులతో సంప్రదింపులు జరుపుతోందన్నారు. రాజధాని అభివృద్ధి ఇక అన్ స్టాపబుల్ అని స్పష్టం చేశారు. రాజధాని చుట్టపక్కల ప్రాంతాల్లో లేఅవుట్లకు అనుమతుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

కాగా.. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు చేరుకున్న సీఎం.. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అలాగే కొందరికి అక్కడికక్కడే పరిష్కారాలు చూపారు. సీఎంకు వినతులు ఇచ్చేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు. దీంతో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్యాలయ సిబ్బంది సీటింగ్ ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు ఎంతో ఓపిగ్గా ఒక్కొక్కరి వద్దకు వెళ్లి సమస్య తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

## శబరి యాత్రలో జగన్ జపం.




**విశాఖపట్నం, నవంబర్ 29:** అయ్యప్ప మాలను భక్తులు ఎంతో పరమ పవిత్రంగా ధరించి.. భక్తి భావంలో మునిగి పోతారు. మాలధా రణలో ఆ మణి

2 లో

## దిత్వా తుఫాను ముప్పు..

ఏపీని దిత్వా తుఫాను ముప్పు భయపెడుతోంది. నైరుతి బంగాళాఖాతంలో దిత్వా తుఫాను కేంద్రీకృతమై ఉంది. శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయానికి దిత్వా తుఫాను కారైకాల్‌కి 150 కి,మీ., పుదుచ్చేరికి 250 కిలోమీటర్లు, చెన్నైకి 350కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని ఏపీ

2 లో



## కేబినెట్ మీటింగ్‌లో తప్పుడు ప్రజంటేషన్..




**అమరావతి, నవంబర్ 29 క్రైమ్ కౌంటర్ న్యూస్ ) :** సాక్షాత్తు కేబినెట్ మీటింగ్‌కే తప్పుడు సమాచారం ఇచ్చాడో అధికారి. సీఎం, ఇతర మంత్రులు ప్రజెంటేషన్ కోసం ఎదురు చూస్తున్న సమయంలో సదరు ఆఫీసర్ నిర్లక్ష్యం వల్ల ఒక ఫైల్ బదులు మరోకటి ప్రజెంటేషన్‌కు వచ్చింది. దీంతో ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు తీవ్ర అసహనానికి గురయ్యారు. పొరపాటు గమనించిన అధికారులు.. వెంటనే సరైన ప్రజెంటేషన్‌ను వారి ముందు ఉంచారు. సదరు అధికారి నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు.. అతడిని సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. ఆ వివరాలు..

శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశానికి తప్పుడు సమాచారమిచ్చినందుకు గాను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు చెందిన సెక్షన్ ఆఫీసర్ కె.విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అసలేం జరిగిందంటే.. శుక్రవారం నిర్వహించిన కేబినెట్ మీటింగ్‌లో.. నగరాలు, పట్టణాల్లో హోర్డింగ్‌ల ప్రదర్శించాలంటే.. లైసెన్సులు

2 లో

## బాబు సర్కార్ కీలక నిర్ణయం..

# ఏపీకి కొత్త సీఎస్



**అమరావతి, నవంబరు29** ఏపీ నూతన సీఎస్‌గా జి.సాయిప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. 2026 మార్చి ఒకటో తేదీ నుంచి సాయిప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత సీఎస్ కె. విజయానంద్ పదవీకాలాన్ని మరో మూడు నెలలు (మార్చి 28, 2026) పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ఏపీ సర్కార్. ఈ మేరకు జీవో నంబర్ 2230ను విడుదల చేసింది ప్రభుత్వం. మరోవైపు.. పదిమంది డిప్యూటీ కలెక్టర్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జీవో ఆర్టీ నెంబర్ 2228 జారీ చేశారు సీఎస్ విజయానంద్.

## ధాన్యం కొనుగోళ్లపై మంత్రి నాదెండ్ల కీలక ప్రకటన



రాష్ట్ర రైతులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షించిన మంత్రి నాదెండ్ల మనోహర్, కొనుగోళ్లను సంక్రాంతి వరకు పొడిగిస్తున్నట్లు కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు 11 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో రూ. 2300 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. సాంకేతిక సమస్యలను పరిష్కరి స్తున్నామని, ఖరీఫ్ పంట ప్రతి బస్తాను కొను గోలు చేస్తామని మంత్రి తెలిపారు.

## ఏపీ సీఎస్ విజయానంద్ పదవీ కాలం పొడిగింపు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పదవీ కాలాన్ని కేంద్రం పొడిగించింది. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత సీఎస్ విజయానంద్ పదవీకాలం నవంబర్ 30తో ముగియనుంది. నవంబర్ నెలాఖరున ఆయన రిటైర్ కావాల్సి ఉంది. అయితే విజయానంద్ పదవీ కాలాన్ని మరో మూడు నెలలు పొడిగించాలని కేంద్రాన్ని ఏపీ ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో విజయానంద్ పదవీకాలం పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2026 ఫిబ్రవరి వరకూ

2 లో



# దిత్వా తుఫాను ముప్పు..

విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. గత ఆరు గంటలుగా దిత్వా తుఫాను గంటకు పది కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్లు అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామునకు దిత్వా తుఫాను తమిళనా డు, పుదుచ్చేరి, దక్షిణకోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. అనంతరం తుఫాను.. తీవ్రవాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు. దిత్వా తుఫాను ప్రభావంతో శనివారం రోజున చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలుకురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో మంగళవారం వరకు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు సూచించింది. ప్రజలు, రైతులను కూడా అప్రమత్తం చేసింది.

మరోవైపు దిత్వా తుఫాను నేపథ్యంలో ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులతో సమీక్షించారు. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దిత్వా తుఫాను తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రభావిత జిల్లాలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హోం మంత్రి అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితులలో సహాయక చర్యల కోసం ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తుఫాను ప్రభావిత ప్రాంతాలకు పంపించాలని ఆదేశించారు.

మరోవైపు దిత్వా తుఫాను ప్రభావంతో ఆదివారం, సోమవారం దక్షిణ కోస్తా జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ అధికారులు హోంమంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని .. తుఫాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. మరోవైపు భారీ వర్షాలు కురిసే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు వీలైనంత వరకు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని హోం మంత్రి అనిత విజ్ఞప్తి చేశారు. అత్యవసర సహాయక చర్యల కోసం టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 1800-425-0101లో సంప్రదించాలని సూచించారు.

## కేబినెట్ మీటింగ్‌లో తప్పుడు ప్రజంటేషన్.. ఆ ప్రభుత్వ ఉద్యోగిపై వేటు

తప్పనిసరి చేస్తూ నిబంధనలు సవరించారు. దీనిపై శుక్రవారం జరిగిన కేబినెట్ భేటీలో చర్చ జరగాల్సి ఉంది. అయితే సెక్షన్ ఆఫీసర్ నిర్లక్ష్యం కారణంగా.. దీనికి బదులుగా మరో ప్రజంటేషన్ వచ్చింది.సదరు అధికారి చర్యలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు.. ఇతర మంత్రులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తప్పుడు ప్రజెంటేషన్ వచ్చిన విషయాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు వెంటనే స్పందించి..హోర్డింగుల ప్రదర్శనకు లైసెన్స్ తప్పనిసరి చేస్తూ.. సవరించిన నిబంధనల వివరాలను మళ్లీ మంత్రిమండలి ముందు పెట్టారు. అనంతరం కేబినెట్ దీనికి ఆమోదం తెలిపింది. ఈక్రమంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సెక్షన్ ఆఫీసర్ విజయ్‌కుమార్ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు.. అతడిని విధుల నుంచి సస్పెండ్ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు.ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖాళీ స్థలం పన్నుపై 50 శాతం మినహాయింపు, హోర్డింగులు, ప్రకటనలు ప్రదర్శించాలంటే లైసెన్స్ తప్పనిసరి చేస్తూ నిర్ణయం.. అలానే ఆయుష్‌ను అలోపతికి సమానంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. ఇక మీదట సంవత్సరానికి నాలుగు సార్లు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ.. కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

# శబరి యాత్రలో జగన్ జపం.

కంఠుడి ధ్యాస తప్ప వేరే ఆలోచనలకు చోటు ఇవ్వరు. ఎంతో శ్రద్ధ, నిష్టతో అయ్యప్పను పూజిస్తారు. 41 రోజుల పాటు అయ్యప్ప స్వామి పూజను చేసి ఆ తరువాత ఇరుముడి కట్టుకుని శబరిమలకు స్వాములు పయనమవుతారు. శబరిమల యాత్రలో కూడా అయ్యప్ప భజన చేస్తూ.. స్వామిని స్మరించుకుంటూ తమ ప్రయాణాన్ని కొనసాగిస్తుంటారు. కానీ ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించారు ఏపీలోని పలువురు స్వాములు.వైసీపీకి చెందిన పలువురు నేతలు అయ్యప్ప మాల ధరించి శబరి యాత్రకు పయనమయ్యారు. అయితే శబరి యాత్రలో జగన్ జపం చేస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. శబరిమలకు వెళ్తూ జగన్, ఇతర నేతల బ్యానర్లు ప్రదర్శిస్తున్నారు. జగన్ 2.0 అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శించడమే కాకుండా జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్నారు. ఇటీవల అనకాపల్లికి చెందిన వైసీపీ నేతలు జగన్ బ్యానర్‌తో శబరి యాత్ర చేయగా.. తాజాగా విశాఖ జిల్లా పెందుర్తికి చెందిన వైసీపీ నేతలు జగన్ జపంలో మునిగిపోయారు.

పెందుర్తి నియోజకవర్గం వైసీపీకి చెందిన అయ్యప్ప స్వామి భక్తులు శబరిమలకు వెళ్తూ జగన్ బ్యానర్లు ప్రదర్శించారు. జగన్ ఫోటోతో పాటు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, వైసీపీ నేతల ఫోటోలతో కూడిన బ్యానర్లు ప్రదర్శించారు. మొత్తం మూడు ఫ్లెక్సీలతో కూడిన బ్యానర్లను ప్రదర్శించారు. ఈ వీడియోలన్నీ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వైసీపీ నేతల ఓవరాక్షన్‌పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. అయ్యప్ప స్వామి ఇరుముడి పట్టుకుంటూ ఇలా రాజకీయ నేతల ఫోటోల ప్రదర్శనపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. శబరిమలకు వెళ్తున్నప్పుడు రాజకీయ నేతలు ఫోటోలతో ప్రదర్శన ఏమిటి అంటూ అయ్యప్ప స్వాములు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే అనకాపల్లి జిల్లా పాయకరావుపేట చెందిన వైసీపీకి చెందిన అయ్యప్ప స్వాములు కూడా ఇలానే జగన్ రెడ్డి బ్యానర్లు పట్టుకొని ప్రదర్శించారు. అంతే కాకుండా జై జగన్ నినాదాలు చేశారు. ఈ ఘటన మరువక ముందే మళ్లీ ఇలాంటిదే చోటు చేసుకోవడంతో హిందూ సంఘాలు, అయ్యప్ప స్వామి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇటువంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని అయ్యప్ప భక్తులు కోరుతున్నారు.

## ఏపీ సీఎస్ విజయానంద్ పదవీ కాలం పొడిగింపు

విజయానంద్ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతారు. అనంతరం నూతన సీఎస్‌గా.. ఏపీ జలవనరుల శాఖ, సీఎంవో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న జి.సాయిప్రసాద్ నియమితులు కానున్నారు.

మరోవైపు సాయిప్రసాద్ సర్వీస్ 2026 మే నెలాఖరు వరకూ ఉంది. అయితే ఆ తర్వాత కూడా కొన్ని రోజులు సర్వీసు పొడిగించి సాయిప్రసాద్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగించే అవకాశాలు ఉన్నాయని తెలిసింది.అయితే ఒకే సమయంలో పాత సీఎస్ పదవీకాలం పొడిగింపు, కొత్త సీఎస్ నియామకం చేపట్టడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. అయితే పరిపాలనా బాధ్యతల బదిలీతో పాటుగా ముఖ్యమైన నిర్ణయాలు అమలు చేయడంలోనూ.. పాలనలో సమన్వయం కోసం ఈ విధానం చేపట్టినట్లు సమాచారం.

1991వ బ్యాచ్‌కు చెందిన సాయిప్రసాద్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ కార్యదర్శిగా, సీఎంవో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. ఫిబ్రవరి 28వ తేదీన విజయానంద్ సీఎస్ పదవి నుంచి తప్పుకున్న అనంతరం సాయిప్రసాద్ బాధ్యతలు చేపడతారు. అయితే ఆయన సర్వీస్ 2026 మేతో ముగియనుండగా.. ప్రభుత్వం మరికొన్ని రోజులు పొడిగించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ప్రస్తుత సీఎస్ విజయానంద్ నేపథ్యానికి వస్తే.. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నల్లగొండ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. అలాగే ఏపీ ట్రాన్స్ కో , ఏపీ జెన్ కో సీఎండీగానూ సేవలు అందించారు. రాష్ట్ర విభజన తదుపరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎనర్జీ, ఐటీ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీగా పనిచేశారు. ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవోగానూ బాధ్యతలు నిర్వహించారు.2024 డిసెంబర్ 30 న ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. తాజా పొడిగింపుతో 2026 ఫిబ్రవరి 28 వరకూ ప్రభుత్వ ప్రదాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

## జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపిన శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు



**క్రైమ్ కౌంటర్ ప్రతినిధి:::తిరుపతి నవంబర్ 29**తిరుపతి నగరంలో జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తిరుపతి దామినేడు ప్రాంతంలో 28 ఎకరాల భూమిని స్పోర్ట్స్ సిటీ కోసం ఆమోదం తెలిపింది.తిరుపతిని క్రీడా హబ్‌గా అభివృద్ధి చేయాలని శాప్ చైర్మన్ రవి నాయుడు చేసిన అభ్యర్థన మేరకు గతంలో తిరుపతి జిల్లా కలెక్టర్ గారు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధిత ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు ఆమోదం లభించడంతో, ఈ రోజు శాప్ చైర్మన్ రవి నాయుడు గారి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డి.ఎస్.డి.ఓ, కోచులు మరియు సిబ్బంది కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ %ూ%. వెంకటేశ్వర్ %ూూ% గారిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ

“తిరుపతిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ గారు చూపిస్తున్న కృషి ప్రశంసనీయం. రానున్న రోజుల్లో దక్షిణ భారతదేశానికి తిరుపతి ప్రముఖ క్రీడా కేంద్రంగా అవతరించనుంది” అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నరసింహ యాదవ్ పాల్గొన్నారు

## చిన్నగార్లపాడులో సీసీ రోడ్డు విజయవంతం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం



**క్రైం కౌంటర్ కారంపూడి** మండలంలోని చిన్నగార్లపాడు గ్రామంలో రజకుల బజారు సీసీ రోడ్డు పనులను అసిస్టెంట్ ఇంజనీరింగ్ రవి, ఏఈ సత్యనారాయణ మరియు ఆర్ఐ పర్యవేక్షణలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్డు ను విజయవంతంగా బత్తుల శ్రీను, పాసం శ్రీను, చల్లా శ్రీను (రేషన్ డీలర్ )మరియు చల్లా శ్రీను టీడీపీ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అని చిన్నగార్లపాడు గ్రామ ప్రజలు పేర్కొన్నారు. ఎన్నో సంత్సరాలుగా రజకుల బజారు లోని నివాసం వున్నా ప్రజలు రోడ్డు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్న తరుణంలో టీడీపీ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వం తోనే సాధ్యం అని నిరూపించారు.రజకుల బజారులో ఉన్న వారందరూ సీసీ రోడ్డు వేసినందుకు ఎంతో ఆనందంగా ఉందని వ్యక్తం చేశారు. మేస్త్రి వల్లెపు వెంకటేశ్వరరావు మరియు కూలీలు ఈ కాంట్రాక్టు ఇచ్చిన పాసం శ్రీను, చల్లా శ్రీను (రేషన్ డీలర్) మరియు చల్లా శ్రీను కు కృతజ్ఞతలు తెలిపారు

## దశ సహస్ర సువాసిని పూజ కార్యక్రమానికి ఆహ్వానం అందుకున్న తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి





**క్రైమ్ కౌంటర్ ప్రతినిధి:::తిరుపతి నవంబర్ 29**శ్రీ శక్తి పీఠం శ్రీ రమ్యానందభారతి స్వామి వారి అధ్వర్యంలో భారత దేశంలోనే మొట్టమొదటసారిగా 10 వేల మందితో సువాసినల ప్రత్యక్ష పూజ మహోత్సవం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనవలసినది గా తుడా చైర్మన్ తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి ని శ్రీ శక్తి పీఠం ప్రతినిథులు,అర్చకులతో కలిసి ఆహ్వానించడం జరిగింది.

# రేపు ఏపీలో వర్షపు బీభత్సం



దిత్వా తుపాన్ ప్రభావంతో రాబోయే రెండు రోజులుగా దక్షిణ కోస్తా మరియు రాయలసీమ ప్రాంతాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. నవంబర్ 30న ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మోస్తరు వర్షాలు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు మరియు పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.డిసెంబర్ 1వ తేదీన ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు. కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని తెలిపారు. ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, కడప, అన్నమయ్య జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో పలు చోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత ఆదేశాల ప్రకారం అత్యవసర సహాయక చర్యల కోసం కడపలో 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, వెంకటగిరి ప్రాంతంలో 3 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉంచామని తెలిపారు.విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ తుఫాన్ గమనాన్ని పర్యవేక్షిస్తూ, ప్రభావిత జిల్లాల యంత్రాంగాన్ని ఎల్లప్పుడూ అలెర్ట్‌లో ఉంచుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. సముద్రంలో ఉన్న మత్స్యకారులను రప్పించి, రైతులు భారీ వర్షాల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదల కోసం లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## తిరుమలలో రద్దీ.. 18 కంపార్టుమెంట్లలో వేచివున్న భక్తులు

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. నిన్న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 18 కంపార్టుమెంట్లలో వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 10 గంటల్లో సర్వదర్శనం అవుతుందని అధికారులు తెలిపారు. శుక్రవారం 70,044 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 25,559 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీ ఆదాయం రూ.3.47 కోట్లుగా నమోదైంది. తెనాలికి చెందిన రామకృష్ణ కిలారి అనే భక్తుడు అన్నప్రసాదం ట్రస్టుకు రూ. కోటి విరాళం అందించారు.

## క్రికెట్ టోర్నమెంటు ప్రారంభించిన ఎంఈఓ సత్యనారాయణ





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ టీచర్స్ క్రికెట్ గేమ్స్ ను ప్రారంభించిన తాడిశెట్టి సత్యనారాయణ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఆటల వల్ల పిల్లలకు కానీ పెద్దలకు కానీ మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## 7 గ్రామాలు.. 16,666 ఎకరాలు

**జరీబు భూమికి నివాస స్థలం 1,000 గజాలు, వాణిజ్య ప్లాటు 450 గజాలు**

**మెట్ట భూములకు నివాస స్థలం 1,000 గజాలు, వాణిజ్య ప్లాటు 250 గజాలు**

**అమరావతిలో రెండో విడత భూసమీకరణకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్**

**వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కర్లపూడిల్లో 7,562 ఎకరాలు**

**వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమిలో 9,104 ఎకరాలు.. త్వరలో నోటిఫికేషన్**

**భూములిచ్చిన రైతులకు గత నిబంధనలే**



అమరావతి, నవంబరు 29 అమరావతి రాజధాని నిర్మాణానికి రెండో విడత భూసమీకరణకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొదటి విడతలో 34వేల ఎకరాలు సేకరించిన సీఆర్‌డీఏ తాజాగా మరో 16,666.56 ఎకరాలు సేకరించేందుకు రంగం సిద్ధం చేసింది. దీంతో అమరావతి కోసం రైతుల నుంచి 50వేల ఎకరాలు సేకరించినట్లవుతుంది. మొదటి విడత భూసమీకరణలో 28,526 మంది రైతుల నుంచి 34,400 ఎకరాలు సేకరించారు. మొదటి దశలో సీఆర్‌డీఏకు ప్రభుత్వ భూమి సుమారు 16వేల ఎకరాలు అప్పగించారు. దీంతో మొత్తం ప్రభుత్వ భూమి, రైతుల దగ్గర నుంచి తీసుకున్న భూమితో కలిపి 74వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణం చేపట్టనున్నారు. రెండో విడతకు సంబంధించి ఏడు గ్రామాల్లో రైతుల నుంచి భూమిని సమీకరించనున్నారు. దీనికి సంబంధించి సీఆర్‌డీఏ త్వరలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. రాజధాని ప్రాంతంలో రైల్వేస్టేషన్, రైల్వే లైన్, స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం మరోసారి భూసమీకరణకు వెళ్లాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "రాజధాని విస్తరణ కోసం మలివిడత భూసమీకరణకు సీఎం నిర్ణయం తీసుకున్నారు. దీనికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రెండో విడతలో 7 గ్రామాల్లో 16,666.56 ఎకరాలు సమీకరించాలని నిర్ణయించాం. రాజధానిలో వచ్చే 30 ఏళ్లకు సరిపడా ప్రజల జీవన స్థితి ఉండేలా కార్యాచరణ రూపొందించాం. ఈ ప్రాంతంలో భూమి రేట్లు పెరగాలన్నా, వృద్ధి రేటు పెరగాలన్నా.. కచ్చితంగా స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలి. అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం లేకపోతే అభివృద్ధి చెందదు. అందుకే 500 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు కట్టాలని సీఎం నిర్ణయించారు. వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కర్లపూడిల్లో 7,562 ఎకరాలు, వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమిలో 9,104.57 ఎకరాలు సమీకరించాల్సి ఉంది. ఈ గ్రామాల్లో ప్రభుత్వ భూమి 3,828 ఎకరాలు ఉంది.

# శ్రీసిటీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముగిసిన భాగవత సప్తాహ మహోత్సవం










**క్రైమ్ కౌంటర్ ప్రతినిధిశ్రీసిటీ, నవంబర్ 29, 2025:**శ్రీసిటీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన భాగవత సప్తాహ మహోత్సవం శనివారం దిగ్విజయంగా ముగిసింది. శ్రీసిటీ-శ్రీవాణి సౌజన్యంతో భాగవత భక్త సమాజ బృందం ఈ నెల 23న ఆలయ ఆవరణలో భాగవత సప్తాహ కార్యక్రమం ప్రారంభించారు. 25 మంది బృంద సభ్యులు వారం రోజుల పాటు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు అత్యంత భక్తి శ్రద్దలతో 12 స్కంధాలతో కూడిన 335 అధ్యాయాలు, 18 వేల భాగవత శ్లోకాలను పఠనం గావించి, శనివారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలతో కార్యక్రమం పూర్తిచేశారు. ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జున చేసే క్రమంలో భాగవత వైశిష్ట్యాన్ని వివరిస్తూ రాష్ట్రమంతటా ప్రతినెలా భక్తులు కోరిన చోట ఈ భాగవత భక్త సమాజ బృందం వారు భాగవత సప్తాహన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 421 సప్తాహాలు పూర్తిచేయగా, శ్రీసిటీలో 422 వ కార్యక్రమం నిర్వహించినట్లు బృంద సభ్యులు తెలిపారు. పచ్చదనం నిండిన చల్లని ఆహ్లాదకర వాతావరణంలో శ్రీసిటీ ఆలయంలో వారం రోజుల భాగవత సప్తాహం తమకు ఎంతో హాయిని ఇచ్చిందని వారు పేర్కొన్నారు. అన్ని వసతులు సమకూర్చి తమకు ఈ అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చివరిరోజు కార్యక్రమంలో పాల్గొని, భాగవత భక్త సమాజ బృందానికి కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వరుసగా మూడవ ఏడాది శ్రీసిటీలో శ్రీమద్భాగవత సప్తాహం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇది ఈ ప్రాంతానికి అత్యంత ప్రయోజనకరమైన ఒక యజ్ఞం లాంటిదని వ్యాఖ్యానించారు. మొత్తం బృందం యొక్క దైవిక ప్రయత్నాన్ని ఆయన అభినందించారు. భాగవత భక్త సమాజ సభ్యులను శాలువాలతో సత్కరించి, స్వామి వారి తీర్థ, అన్న ప్రసాదాలను అందచేశారు.

పరిసర గ్రామాల ప్రజలు భాగవత సప్తాహం మరియు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. శ్రీసిటీ ప్రతినిధులు పి.ఎస్.బి.శాస్త్రి, పల్లేటి బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# "ఇల్లు లేని వారి కోసం ప్రకాశవంతమైన శుభవార్త!"

పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సొంతిల్లు లేని పేదలకు కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ హౌసింగ్ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఇంకా ఒకరోజు మాత్రమే గడువు ఉంది.ఇప్పటికే కొన్ని రోజులుగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతుండగా ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇప్పటివరకు నాలుగు లక్షల మందికిపైగా దరఖాస్తులు సమర్పించినట్టు సమాచారం. రేపటితో గడువు ముగియనున్నందున చివరి రోజున భారీగా దరఖాస్తులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇల్లు లేని నిజమైన నిరుపేదలకు ప్రాధాన్యమిస్తూ, గతంలో ఏ హౌసింగ్ లబ్ధి పొందని వారికి ఈ అవకాశాన్ని అందించనున్నారు. పేదల సొంతింటి కలను త్వరగా నెరవేర్చేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది.

లిప్రత్యేక యాప్ ద్వారా గుర్తింపు : రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. పథకం అమలులో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ఆవాస్ం (%ఝుఝుంౌాశ్రీబం%) అనే ప్రత్యేక యాప్ ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా అర్హుల గుర్తింపు, వివరాల సేకరణ, ఇంటి స్థలం ధృవీకరణ వంటి కార్యకలాపాలు పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతున్నాయి. గ్రామ/వార్డు సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహనిర్మాణ శాఖ ఏఈలు ఇంటింటికి వెళ్లి అర్హులను గుర్తించే బాధ్యత చేపట్టారు. గడువు రేపటితో ముగియనున్నందున చివరి రోజున మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

%-% ఈ దరఖాస్తు ప్రక్రియలో భాగంగా అభ్యర్థి ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి ఫోటో, అలాగే ఇల్లు నిర్మించబోయే స్థలపు ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. యాప్‌లో తీసే ముఖచిత్రం ఆధారంగా ఆధార్ సమాచారం ఆటోమేటిక్‌గా ప్రదర్శించబడుతుంది. అనంతరం జాబ్ కార్డు వివరాలు నమోదు చేస్తారు. మొత్తం ప్రక్రియ రియల్-టైమ్ ట్రాకింగ్‌లో ఉండడంతో దరఖాస్తుల నిజానిజాలు గుర్తించడం సులభమవుతుంది.



%-% గతంలో పీఎం ఆవాస్ యోజన పట్టణ ప్రాంతాల్లో మాత్రమే అమలయ్యేది. ఇప్పుడు దీనిని గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించారు.

%-% పేదల కోసం ఇల్లు మంజూరు ప్రక్రియలో రెండు విధానాలు అమలు చేయనున్నారు. సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించనున్నారు. స్థలం లేని వారికి గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించి ఇళ్లను నిర్మించనున్నారు. రెండు వర్గాల కోసం వేర్వేరు జాబితాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

%-% కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎంపిక పద్ధతిలో అత్యంత పేదలను ముందుగా అర్హులుగా గుర్తించి ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికే ఈ ప్రత్యేక యాప్ రూపొందించబడింది.

%-% రాష్ట్ర ప్రభుత్వం యాప్ ద్వారా నమోదైన వివరాలను కేంద్రానికి పంపుతుంది. అనంతరం కేంద్రం మరోసారి పరిశీలించి తుది అర్హుల జాబితాను విడుదల చేస్తుంది.

# సినిమా



## స్పెషల్ సాంగ్‌కు కళ్లు చెదిరే పారితోషకం

టాలీవుడ్‌లో ఒక సినిమా హిట్ కావాలంటే, ప్రత్యేక గీతాలు (ఐటెం సాంగ్స్) కీలకం. మూడు నిమిషాల పాట కోసం హీరోయిన్ డాన్స్ చేస్తే అది మాత్రమే సినిమాను బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోయేలా చేస్తుంది. కానీ, ఆ పాటలకు హీరోయిన్లు ఎంత రెమ్యునరేషన్ తీసుకుంటున్నారో తెలుసా? అది చాలా మంది చిన్న హీరోల ఫుల్ రెమ్యునరేషన్ కంటే ఎక్కువ! ఇటీవల ఒక ఫోటో గ్యాలరీలో బయటపడిన వార్తల ప్రకారం, టాలీవుడ్‌లో టాప్ 5 ఐటెం సాంగ్ హీరోయిన్లు కోట్ల రూపాయల పారితోషకం అందుకుంటున్నారు. వాళ్లు ఎవరు, ఎంత తీసుకుంటున్నారో%ౌ% ఇప్పుడే చూద్దాం!టాలీవుడ్‌లో ఐటెం సాంగ్స్ అంటే గ్లామర్, ఎనర్జీ, డాన్స్ మ్యాజిక్. హీరోయిన్ ఒక్కసారి పాటలో ఆడితే, ఆ సినిమా మొత్తం హైలైట్ అవుతుంది. ఈ ట్రెండ్‌తోపాటు మొదలైనప్పటి నుంచి రెమ్యునరేషన్ కూడా భారీగా డిమాండ్ చేస్తున్నారు. పాపులారిటీ, డాన్స్ స్కిల్స్, పాత హిట్ పాటలు ఇవన్నీ ఫీజ్‌ను డిసైడ్ చేస్తాయి. ఇప్పుడు, టాప్ 5 లిస్ట్‌లోకి వెళ్దాం

**1. సమంత – రూ. 5 కోట్లు!**

పాన్–ఇండియా స్టార్ సమంత, 'పుష్ప'లో 'ఊ అంటావా మామా' పాటతో ఐటెమ్ సాంగ్ క్వీన్‌గా మారింది. ఆ పాట యూట్యూబ్‌లో 1 బిలియన్ వ్యూస్ క్రాస్ చేసింది. ఆమె ఫీజ్ హీరోల రెమ్యునరేషన్‌ను కూడా మించిపోతుంది. బిజీ షెడ్యూల్‌లో కూడా, ఐటెమ్ సాంగ్స్‌కి గ్రీన్ సిగ్నల్ ఇస్తోంది. ఆమె డాన్స్ మూవ్స్, స్క్రీన్ ప్రెజెన్స్%ౌ% పర్ఫెక్ట్ మిక్స్!

**2. తమన్నా భాటియా –రూ. 2 కోట్లు!**

బాలీవుడ్ సినిమాల్లోనూ సందడి చేస్తున్న తమన్నా.. 'జైలర్'లో రజినీకాంత్‌తో ఐటెమ్ సాంగ్ చేసి మరోసారి హిట్ అందుకుంది. గ్లామర్‌తోపాటు డాన్స్ మూవ్స్ ఆమె ప్రత్యేకత. ఆమె ఫిట్‌నెస్, గ్రేస్‌ఫుల్ డాన్స్ వల్ల డైరెక్టర్లు ముందే డేట్స్ బుక్ చేసుకుంటారు. 2 కోట్ల ఫీజ్‌తో ఆమె టాలీవుడ్‌లో టాప్ చాయిస్‌గా ఉంది.

**3. కాజల్ అగర్వాల్ – రూ. 1.5 నుంచి 2 కోట్లు!**

క్లాసిక్ బ్యూటీ, చందమామ కాజల్.. 'జనతా గ్యారేజ్'లో ఎన్టీఆర్‌తో స్పెషల్ సాంగ్ చేసి అదరగొట్టింది. ఆమె స్టైల్, ఎక్స్‌ప్రెషన్స్ స్పెషల్ పాటలకు ప్లస్. ఫీజ్ రేంజ్ 1.5–2 కోట్ల వరకు ఉంది. అయితే ప్రాజెక్ట్ స్కేల్ మీద డిపెండ్ అయ్యి కూడా రెమ్యునరేషన్ వసూలు చేస్తుందట కాజల్. కాజల్ ఐటెమ్ సాంగ్స్‌లో కమ్‌బ్యాక్ చేస్తారా అని ఆమె అభిమానులు కూడా ఎదురుచూస్తున్నారు.

**4. పూజా హెగ్డే – రూ. 1.5 కోట్లు!**

సెన్సేషన్ పూజా హెగ్డే.. 'కూలీ'లో రజినీకాంత్ సినిమాలో ప్రత్యేక గీతం చేసి తాజాగా హైలైట్‌గా నిలిచింది. ఆమె ఎనర్జీ, మోడరన్ లుక్ వల్ల డైరెక్టర్లు ఆమెను ప్రిఫర్ చేస్తున్నారు. 1.5 కోట్ల రెమ్యునరేషన్‌కు ఓకే చేస్తుండడం ఆమెకు ఆఫర్లను తెచ్చిపెడుతోందట. పూజాకు ఐటెమ్ సాంగ్స్‌లో కూడా హిట్ ట్రాక్ రికార్డ్ ఉంది.

**5. శ్రుతి హాసన్ – రూ. 90 లక్షలు!**

మల్టీ–టాలెంటెడ్ శ్రుతి, 'హై నాన్న'లో నానితో 'ఓద్యమ్మ' పాట చేసి ప్రశంసలు అందుకుంది. ఆమె వాయిస్, డాన్స్ కాంబినేషన్ యూనిక్. 90 లక్షల ఫీజ్‌తో కూడా, ఆమె క్లాస్, వైబ్ వల్ల డిమాండ్ ఎక్కువ. శ్రుతి ఐటెమ్ సాంగ్స్‌లో ఎక్స్‌పెరిమెంటల్ టచ్ ఇస్తుంది.

ఈ లిస్ట్ చూస్తే ఐటెమ్ సాంగ్స్ టాలీవుడ్‌లో హీరోయిన్లకు గోల్డ్ మైన్ అనిపించక మానదు. సమంత లాంటి స్టార్స్ 5 కోట్లు తీసుకుంటుంటే, మిగిలినవారు కూడా కోట్ల రూపాయల రేంజ్‌లోనే ఉన్నారు. ఇది వాళ్ల పాపులారిటీ, హిట్ ట్రాక్ రికార్డ్‌కు సాక్ష్యం. అయితే, ఈ పాటలు సినిమా సక్సెస్‌కు ఎంత ఇంపాక్ట్ చేస్తాయో అందరికీ తెలిసిందే. ఈ హీరోయిన్లలో ఎవరి ఐటెమ్ సాంగ్ మీకు ఫేవరెట్?





## సర్వ రోగ నివారిణి.. ఈ పొడిని మీ ఆహారంలో చేర్చుకుంటే..




పసుపు, నల్ల జీలకర్ర, మునగ వంటి మూలికలను మిశ్రమంతో తయారు చేసే పొడి మన ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. పసుపులో శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ లక్షణాల ఉంటాయి.ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతో పాటు పేగు ఆరోగ్యానికి సహాయపడుతాయి. ఇక నల్ల జీలకర్రలో థైమోక్వినోన్ ఉంటుంది, ఇది యాంటీమైక్రోబయల్, శోథ నిరోధక ప్రయోజనాలను అందిస్తుంది, మునగ ఇనుము, కాల్షియం వంటి అవసరమైన విటమిన్లతో సమృద్ధిగా ఉండే పోషక శక్తి కేంద్రం. ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో, హృదయ సంబంధ ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడంలో సహాయపడుతుంది, ఇది సహజ శక్తి, దీర్ఘాయువు కోరుకునే వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. కాబట్టి వీటిని మన రోజువారి ఆహారంలో చేర్చుకుంటే ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చో ఇక్కడ తెలుసుకుందాం.పసుపు వల్ల కలిగే ప్రయోజనాలు: పసుపును బంగారు సుగంధ ద్రవ్యం ' అని పిలుస్తారు. దీనిని ఆయుర్వేదం వంటి సాంప్రదాయ వైద్య పద్ధతుల్లో వేల సంవత్సరాలుగా ఉపయోగిస్తున్నారు వైద్య నిపుణుల ప్రకారం.. పసుపుతో ఉండే ప్రధాన క్రియాశీల పదార్థం, కర్కుమిన్, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, ఇది ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది, ఇది అనేక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉంది. కాబట్టి మీకు ఆర్థరైటిస్, మెటబాలిక్ సిండ్రోమ్ లేదా నిరాశగా అనిపిస్తే గోరువెచ్చని పాలు లేదా హెర్బల్ టీలో చిటికెడు పసుపును కలుపుకొని తాగండి. ఇలా చేయడం వల్ల మీ రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు మీ చర్మం సహజ మెరుపును పొందుతుంది.



నల్ల జీలకర్ర వల్ల కలిగే ప్రయోజనాలు: దీవెన విత్తనం అని తరచుగా పిలువబడే నల్ల జీలకర్ర సాంప్రదాయ వైద్యంలో ఒక విలువైన మూలికగా పరిగణించబడుతుంది. ఈ చిన్న విత్తనంలో ఉండే థైమోక్వినోన్ కారణంగా ఇది శక్తివంతమైనదిగా నిలిచింది. థైమోక్వినోన్ యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీమైక్రోబయల్, రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలను కలిగి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని మన ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఇది మన శరీర సహజ సమతుల్యతను కాపాడుతూనే.. జీర్ణక్రియ నుండి శ్వాస వరకు వివిధ శరీర వ్యవస్థలకు మద్దతు ఇస్తుంది .మునగ వల్ల కలిగే ప్రయోజనాలు: మిరాకిల్ ట్రీ' అని తరచుగా ప్రశంసించబడే మునగ అనేక పోషకాలతో నిండి ఉంటుంది, దానిలోని ప్రతి భాగంలో విటమిన్లు %ూ, జ, జు%, కాల్షియం, పొటాషియం, అమైనో ఆమ్లాల శ్రేణి వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఇది మీ ఆరోగ్యానికి సూపర్ ఫుడ్ అని చెప్పవచ్చు. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు కణాల వృద్ధాప్యం, దీర్ఘకాలిక మంటకు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. కొన్ని పరిశోదనల ప్రకారం.. మోరింగ కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి, అలసటను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో ఐరన్ ఎక్కువగా ఉన్నందున ముఖ్యంగా మహిళలకు వారి ఋతుస్రావం సమయంలో లేదా ప్రసవ తర్వాత ప్రయోజనకరంగా ఉంటుంది .



**మన దైనందిన జీవితంలో ఈ మూలికల ఉపయోగాలు ఏమిటి?**

పసుపు: ప్రతి రోజూ మార్నింగ్ మీరు తీసుకునే స్మూతీలలో లేదా సూప్‌లలో అదనపు రుచి కోసం ఒక టీస్పూన్ పసుపు కలపండి. దీంతో నల్ల మిరియాలను చేర్చడం అస్సలు మర్చిపోకండి, ఎందుకంటే ఇది మీ శరీరం కర్కుమిన్‌ను బాగా గ్రహించడంలో సహాయపడుతుంది .

నల్ల జీలకర్ర: నల్ల జిలకర్రను గోరువెచ్చని నీటిలో నానబెట్టి ప్రతిరోజూ ఉదయం తాగితే ప్రశాంతంగా ఉంటుంది. ఇది మీకు అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుంది. లేదా సలాడ్లపై చల్లుకుంటే పేగు ఆరోగ్యానికి తోడ్పడుతుంది. అవి వివిధ వంటకాలకు రుచిని పెంచడంతో పాటు మీ రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి.

మునగ: మీ ఉదయపు ఉత్సాహాన్ని పెంచడానికి మీరు తాగే డ్రింక్స్‌లో మునగ పొడిని జోడించండి లేదా మీ బ్రేక్‌ఫాస్ట్లో ఈ పొడిని కలుపుకొని తినడం వల్ల మీరు తక్షణ శక్తిని పొందచ్చు. వీటిని మీరు క్రమం తప్పకుండా మీ రోజువారి జీవితంలో చేర్చుకోవడం ద్వారా దీర్ఘకాలంలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అలాగే మీరు ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా మీ శరీరాన్ని కాపాడుకోవచ్చు.

(గమనిక: పైన పేర్కొన్న అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే అందించబడినవి.. వీటిని టీవీ9 ధృవీకరించట్లేదు.. వీటిపై మీకేవైనా సందేహాలు ఉన్నా.. లేదా ఉపయోగించాలనుకున్నా.. వైద్యులను సంప్రదించండి)

## పాత గెలుపు గుర్రాలే కావాలంటున్న నీతా అంబానీ



రెండుసార్లు మహిళా ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్, %బ్ల్యూ% 2026 సీజన్ కోసం ఒక స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసింది. వేలానికి ముందు ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకున్న ముంబై ఇండియన్స్, వేలంలో న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ అమెలియా కెర్ కోసం ఏకంగా రూ.3 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించింది. పాత ఆటగాళ్లైన షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సజన సజీవన్ మళ్లీ జట్టులోకి రావడంతో ముంబై జట్టు మరింత పటిష్టంగా కనిపిస్తోంది. ముంబై ఇండియన్స్ ఫ్రాంఛైజీ యజమాని నీతా అంబానీ, తాము గతేడాది జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.గత గురువారం (నవంబర్ 27) జరిగిన మహిళా ప్రీమియర్ లీగ్ వేలం గురించి మాట్లాడిన ముంబై ఇండియన్స్ సహ–యజమాని నీతా అంబానీ, వేలం రోజు చాలా ఉత్సాహంగా, కొన్నిసార్లు టెన్షన్‌గా కూడా గడిచిందని అన్నారు. 2025లో ఛాంపియన్‌గా నిలిచిన జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయడమే తమ ప్రధాన వ్యూహమని ఆమె వెల్లడించారు. కీలకమైన ఆటగాళ్లు తిరిగి జట్టులోకి రావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వేలంలో అమెలియా కెర్ తిరిగి జట్టులోకి రావడం అలాగే షబ్నిమ్ ఇస్మాయిల్, సైకా ఇషాక్, సజన సజీవన్, సంస్కృతి గుప్తా వంటి నలుగురు భారతీయ ప్లేయర్లు మళ్లీ రావడం ముంబై ఇండియన్స్‌కు పెద్ద బలం అని ఆమె అన్నారు. అంతేకాకుండా రాహిలా ఫిర్దౌస్, నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ వంటి యువ ప్రతిభావంతులతో పాటు, పూనమ్ ఖేమ్నార్, మిల్లీ ఇల్లింగ్‌వర్త్, నికోలా కేరీలను కూడా ముంబై ఇండియన్స్ ఫ్యామిలీలోకి స్వాగతించారు. ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటికే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు, నాట్ సైవర్–బ్రంట్, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, జి కమలిని వంటి ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. వేలంలో ఇటీవల టీ20 ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన అమెలియా కెర్, ఫాస్ట్ బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ తిరిగి రావడం కోర్ టీమ్‌ను మరింత పటిష్టం చేసింది. ప్రపంచ కప్ విజేత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా న్యూఢిల్లీలో జరిగిన వేలానికి హాజరై, వేలం టేబుల్‌పై వ్యూహాలను రచించడంలో కీలక పాత్ర పోషించారు.వేలంలో తన అనుభవం గురించి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. "నేను మొదట్లో కొంచెం కంగారు పడ్డాను, కానీ మేము ప్రణాళిక చేసిన విధానం, అందరి భాగస్వామ్యం నాకు చాలా బాగా నచ్చింది. నీతా అంబానీ ఎప్పుడూ జట్టుకు సపోర్టుగా ఉండి మాకు అండగా నిలుస్తారు. మా పాత సహచరులలో ఎక్కువ మందిని మేము తిరిగి పొందాము. ఇది ఆ ఆటగాళ్లపై జట్టుకు ఉన్న నమ్మకాన్ని చూపుతుంది" అని అన్నారు. ముంబై ఇండియన్స్ విజయాలలో సైకా, సజన, సంస్కృతి వంటి ఇండియన్ ప్లేయర్లు కీలక పాత్ర పోషించారు. వారు టోర్నమెంట్‌లో ఎదుగుతున్న స్టార్ ప్లేయర్‌లుగా నిలిచారు. ముంబై ఇండియన్స్ జట్టు.. అనేక ప్రపంచ కప్‌ల విజేత అయిన నికోలా కేరీ, యువ ఫాస్ట్ బౌలర్ మిల్లీ ఇల్లింగ్‌వర్త్ అనే ఆస్ట్రేలియన్ జోడీని కూడా తమ జట్టులో చేర్చుకుంది. అలాగే యంగ్ ఇండియన్ టాలెంటుకు సపోర్ట్ ఇచ్చే తమ విధానానికి అనుగుణంగా, భారతీయ ఆల్‌రౌండర్‌లు నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠలను కూడా కొనుగోలు చేసింది. వీరిద్దరూ తొలిసారి డబ్ల్యూపీఎల్ లో ఆడనున్నారు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at D.No: 465, Le Out No 2, Dodleru road, YSR Jagananna Colony, Krosuru, Guntur, Andhra Pradesh - 522410. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com